# యువతలో ఆనందం

# ప్రభుత్వానికి అభివందనం

## ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన నిరుద్యోగ యువకులు

### రూ. 500 కోట్ల నిధుల కేటాయింపుపై కృతజ్ఞతలు

అమరావతి, మార్చి 16 : దేశంలోనే తొలిసారి నిరుద్యోగుల కోసం ప్రత్యేకంగా బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు యువత కృతజ్ఞతాభివందనం తెలిపింది. 2017–18 ఆర్థిక సంవత్సరంలో నిరుద్యోగ యువతకు భరోసా ఇచ్చేలా, భవితకు బంగారు బాట వేసేలా రూ.500 కోట్లు కేటాయించినందున తమ సంతోషం వ్యక్తం చేసేందుకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసానికి గురువారం సాయంత్రం యువకులు తరలివచ్చారు. నిరంతరం తమ ఉన్నతి కోసం ఆలోచిస్తూ, స్ఫూర్తి ప్రదాతగా నిలిచారంటూ ముఖ్యమంత్రిని కలిసి కొనియాడారు.

ఈసారి బడ్జెట్‌లో నిరుద్యోగ యువతకు నిధుల కేటాయింపు ద్వారా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా అన్నారు. నిధుల వినియోగానికి సంబంధించి నిరుద్యోగ నాయకులతో త్వరలో చర్చించి, యువత కోసం వివిధ దేశాల్లో అమలవుతున్న మెరుగైన విధానాలను అధ్యయనం చేసి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ప్రతి రూపాయిని సద్వినియోగపరచడమే లక్ష్యమని చెప్పిన ముఖ్యమంత్రి నైపుణ్యాభివృద్ధి శిక్షణకు ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ. 398 కోట్లను సైతం నిరుద్యోగ యువతకు ఉద్యోగ–ఉపాధి అవకాశాల కలిగించేలా ఖర్చు చేస్తామని అన్నారు. అలాగే యువజన–క్రీడా శాఖకు కూడా ఈసారి భారీగా నిధులు ఇస్తున్నామని చెప్పారు. తమ ప్రభుత్వం ఎప్పుడూ యువతకు అండగా వుంటూ వచ్చిందనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

ముఖ్యమంత్రిని కలిసిన వివిధ యూనివర్సిటీల విద్యార్థి నేతలు, నిరుద్యోగ నాయకులు, టీఎన్ఎస్ఎఫ్ నేతలు ప్రభుత్వం నిరుద్యోగులకు అందిస్తున్న చేయూతపై రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం కల్పించి యువతలో చైతన్యం తీసుకువస్తామని తెలిపారు. ఇందుకోసం అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో సమావేశాలు నిర్వహిస్తామన్నారు.